పత్రికాప్రకటన                                   కాకినాడ, సెప్టెంబర్ 10, 2018.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం.

వయోవృద్ధులకు, దివ్యాంగులకు భరోసా.

మీకోసంలో ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలక్టర్ కార్తికేయ మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు.

సోమవారంనాడు కలక్టరేట్ క్రింద భాగంలో వికలాంగుల కోసం నిర్వహిస్తున్న మీకోసం కార్యక్రమంలో భాగంగా కలక్టర్ దివ్యాంగుల వద్దకు వచ్చి వారి సమస్యలు అడిగితెల్సుకున్నారు. ఈ సందర్భంగా కలక్టర్ కార్తికేయ మిశ్రా మాట్లాడుతూ వయోవృద్ధులు, దివ్యాంగులు సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. అర్జీదారుల నుండి వచ్చిన అర్జీలను, ఫిర్యాదుల పరిష్కారానికి తీసుకున్న నివేదికలను సంబంధిత అధికారులు కలక్టరేట్‌కు సమర్పించాలన్నారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్ కోర్టుహాలులో నిర్వహించిన మీ-కోసం లో 216 అర్జీలు, ఫిర్యాదులను కలక్టర్ కార్తికేయ మిశ్రా , జాయింట్ కలక్టర్ఎ.మల్లిఖార్జున, జాయింట్ కలక్టర్-2 సిహెచ్.సత్తిబాబు స్వీకరించి, సత్వర పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు అందజేశారు. మీకోసంలో గృహాలు, ఇళ్ళ స్థలాలు, ఉద్యోగాలు, పింఛన్లు, కుటుంబ తగాదాలు, భూమి తగాదాలు, ఉపాధి కావాలని తదితర అర్జీలు రాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు పరిష్కారం నిమిత్తం అందజేశారు.

కాకినాడ రూరల్ తూరంగి ఉప్పరపేటకు చెందిన సనిబోయిన అప్పాయమ్మ తనకు గల రెండున్నర కుంచాల భూమి తన కుమారుడు పండించుకుంటున్నాడని, ఆమె యోగక్షేమాలు చూడడం లేదని కలక్టర్‌కు అర్జీని సమర్పించగా, తల్లిని పోషించాలని కొడుకుపై కేసు పెట్టాలని, పోషించేలా చర్యలు చేపట్టాలని కలక్టర్ ఆదేశించారు.అనపర్తి మండలం కుతుకులూరుకు చెందిన వీధి సూరయ్య దివ్యాంగుడు వద్దకు కలక్టర్ వెళ్ళగా, అతను తన కుటుంబ సభ్యులెవ్వరూ పట్టించుకోవడం లేదని, తన ఆస్తిని అమ్ముకుని అనుభవిస్తున్నారని కలక్టర్‌కు విన్నవించగా, విచారించి చర్యలు చేపట్టాలని జేసికి ఆదేశాలు జారీ చేస్తామని కలక్టర్ తెలిపారు. కాకినాడ జగన్నాధపురంకు చెందిన యం.నాగలక్ష్మి తన భర్త పోషించడం లేదని తన ఆవేదనను తెలియజేస్తూ, తనకు ఆర్థిక సహాయం చేయాలని కలక్టర్‌కు అర్జీను అందజేయగా, ఆమె భర్తను విచారించి, తగు చర్యలు చేపడతామని కలక్టర్ తెలిపారు. మానికోటి సూర్యకళా దివ్యాంగురాలు విభిన్నప్రతిభావంతులు, దివ్యాంగుల బాక్‌లాగ్ పోస్టుకు దరఖాస్తు చేశానని, పోస్టుల భర్తీలో తన పేరును పరిగణలోకి తీసుకోవాలని కలక్టర్‌ను కోరగా, పరిశీలించి తగు చర్యలు చేపడతామని కలక్టర్ తెలిపారు. తుని మండలం కుమ్మరిలోవకు చెందిన ఎ.దుర్గాప్రసాద్ పోలవరం ప్రోజెక్ట్ ముంపుప్రాంతాల్లో తమ ఇంటిని కోల్పోయామని కలక్టర్‌కు అర్జీని సమర్పించగా, పెద్దాపురం ఆర్‌డిఓను తగు చర్యలు చేపట్టాలని కలక్టర్ ఆదేశించారు. కిర్లంపూడి శెట్టిబలిజీపేటలో 14 గృహాలను దగ్ధం చేశారని, న్యాయం చేయాలని కలక్టర్‌ను బాధితులు కోరగా, గృహాలు దగ్ధమైన స ంఘటనలో నష్టపరిహారం చెల్లిస్తామని , బాధ్యులైన నిందుతులను అరెస్ట్ చేయాలని పోలీసులకు ఆదేశించామని కలక్టర్ తెలిపారు. బిక్కవోలు మండలం కొమరిపాలెం గ్రామానికి చెందిన మాదే సుబ్బలక్ష్మి తన మేనత్త బడుగు చంద్రలీలావతి ఒకటిన్నర సెంట్లు భూమి తన పేరున వ్రాసిందని దానిలో గృహ నిర్మాణ పథకంలో ఇద్దరం గృహం నిర్మించుకుని జీవిస్తున్నామని , తన మేనత్త మరణించినందున తన సోదరుడు ఇంటిలో నుండి గెంటివేశాడని తనకు న్యాయం చేయాలని జేసికి అర్జీని సమర్పించగా, బిక్కవోలు తహశిల్దారును ఇరు పార్టీల వారిని పిలిచి, విచారించి , సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలన్నారు. మండపేట మండలం జడ్.మేడపాడు, ద్వారపుడి గ్రామాలకు చెందిన ఎస్‌సి, మైనారిటీ వర్గాల వారు సర్వే నెం. 136/6, 343/2, ప్రభుత్వ భూములు ఉన్నాయని వాటిని సాగు కొరకు వారికి ఇవ్వాలని జేసికి అర్జీని సమర్పించగా, మండపేట తహశిల్దార్‌ను విచారణ జరిపి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆలమూరు మండలం జొన్నాడ గ్రామానికి చెందిన షెక్ అస్మిత్ సంబంధిత తహశిల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా పని చేస్తూ మరణించారని, ఉద్యోగం, పెంక్షన్ కొరకు దరఖాస్తు సమర్పించామని, అర్జీని అస్మిత్ కుమార్తె బషీరా జేసికి అందజేయగా, సంబంధిత తహశిల్దార్‌ను కలవాలని జేసి తెలిపారు.

ఇ-క్రాప్, ఇపట్టాకు సంబంధించి కొన్ని మండలాల తహశిల్దార్లు బాగా పని చేసి, ప్రగతి సాధించారని, కొన్ని మండలాల వారు 50 శాతం కన్నా తక్కువ చేశారని, నూరు శాతం లక్ష్యాల సాధనకు కృషి చేయాలని జాయింట్ కలక్టర్ తెలిపారు. ఈ వారం ఇ-పట్టాకు ప్రాధాన్యతనిచ్చి పనులు పూర్తి చేయాలన్నారు. మీకోసం ద్వారా సమస్యలు పరిష్కరిస్తున్నారని , పెండెన్సీ పరిష్కారం ప్రాధాన్యతా క్రమంలో జరుగుతుందన్నారు. ప్రజా సాధికారతా సర్వేకు వచ్చిన అర్జీలు ఎక్కవపెండింగ్‌లో ఉన్నాయని, వాటి పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలన్నారు. అర్జీల పరిష్కారం పై దృష్టి పెట్టాలని, తీసుకున్న చర్యల నివేదికను కలక్టరేట్‌కు అందజేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఎస్‌విఎస్ సుబ్బలక్ష్మి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

( సమాచార శాఖ చే జారీ )